# వైఎస్ఆర్-అన్నమయ్య




బుధవారం 25 డిసెంబర్ 2024


## ప్రజాదర్బార్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు

**చిన్నమండెం, డిసెంబర్ 24 ప్రవాత వార్త:**



అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్షయం చేయరాదని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం, బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం నందు మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారానికి వీఆర్వో నుంచి తాసిల్దార్ వరకు గ్రామాలలో పర్యటించి భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. గతంలో ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడే లేక నేడు సమస్యలు అధికంగా వస్తున్నాయన్నారు. రాబోయే రోజులలో అన్నమయ్య జిల్లాలో ప్రతి పేదవాడి సమస్య పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. మంగళవారం మంత్రి నివాసం నందు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ మంత్రివర్యులు ఓపికగా విని వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామని బాధితులకు హామీ ఇచ్చారు.

## ఎంఐజి లేవుట్‌ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**మదనపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త :**

మదనపల్లె నియోజకవర్గంలో ఎంఐజి లేవుట్ కొరకు ప్రతిపాదించబడిన స్థలాన్ని మంగళవారం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌లో కలసి ఆయన ఎంఐజి లేవుట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎంఐజి లేవుట్ కొరకు ప్రతిపాదించిన స్థలం గురించి వివిధ అంశాలపై మదనపల్లె సబ్‌కలెక్టర్, తహశీల్దార్ ఖాజాబీలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ప్లానింగ్ అధికారి, మదనపల్లె పట్టణ ప్రణాళిక అధికారి జకీరాఖాతూన్, తదితరులు పాల్గొన్నారు.



## శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**చిన్నమండెం, డిసెంబర్ 24 ప్రభాత వార్త:**

చిన్నమండెం మండలం, కేసాపురం గ్రామం ముండ్లవాండ్లకోటలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని క్రితంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గ్రామస్థులకు గతంలో మాట ఇచారు. అందులో బాగంగా బోరు వేసి నూతన మోటార్ బిగించి బోరును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామంలో నూతన బోర్లు వేసి మోటార్లు బిగించి గ్రామాలకు నేటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**చిన్నమండెం, డిసెంబర్ 24 ప్రభాత వార్త:**




జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దేవళంపేట గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సులకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో నూటికి 90 శాతానికి పైగా భూ సమస్యలు ఉన్నాయని భూ సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా భూ అక్రమణలు, 22 ఎ భూముల అక్రమాలతో పాటు, పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి ఆన్లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని భూ బాధితులందరూ రెవెన్యూ సదస్సులలో పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా మంత్రి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

## గురు మోహన్ సన్మానించిన మాలపాటి సునీల్ కుమార్

**బద్వేల్. డిసెంబర్ 24,(ప్రభాత వార్త):**



అడా మాజీ చైర్మన్ సింగసాని గురు మోహన్ పుట్టినరోజు సందర్భంగా మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సునీల్ కుమార్ గజమాలతో ఘనంగా సత్కరించారు. ప్రతి ఏటా పుట్టినరోజు సందర్భంగా గురుమోహన్ ను సునీల్ కుమార్ ఘనంగా సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం సునీల్ కుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ గురు మోహన్ మరెన్నో పదవులు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనసారా కోరుకుంటున్నాను తెలిపారు.

## కన్నుల పండుగ శ్రీ ఈశ్వరిదేవి గురుపూజ మహోత్సవాలు

**బ్రహ్మంగారిమఠం డిసెంబర్ 24, ప్రభాతవార్త :**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మనమరాలు శక్తి స్వరూపిణి జగన్మాత శ్రీ ఈశ్వరిమహాదేవి అమ్మవారి 235వ గురుపూజా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార్ స్వాముల వారి ఆధ్వర్యంలో భక్తుల కోలాహలము నడుమున కనుల పండగ జరిగిందని కార్య నిర్వాహణాధికారి బి.వి.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నెల్లూరు కోలాటం నృత్య బృందలా చేత కోలాటం తో ఆకట్టుకోగా జగన్మాత ఈశ్వరి మహాదేవి మాలా దీక్ష అలంకరణ రూపంలోభక్తులకుదర్శనమిచ్చారు అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళా మాతృమూర్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మహా అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ పూజా కార్యక్రమాలతో అమ్మవారిని తనివి తీరా భక్తులు తరించారు. రాత్రికి అమ్మవారి సింహ వాహనంపై గ్రామోత్సవం, హరికథ కాలక్షేపము నిర్వహించారు. ఈ ఆరాధన మహోత్సవములకు స్థానిక తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మండల నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, సాంబశివరెడ్డి, పూజ శివయ్య యాదవ్, మేకల సుధాకర్, నాగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి, డిసెంబర్ 24 ప్రభాతవార్త**

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద సంబేపల్లి మండలం, శెట్టిపల్లి గ్రామానికి చెందిన సి. మహేష్ అనారోగ్యానికి గురి కావడంతో ఆయనకు 5 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రాన్ని మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారని ఇలాంటి ముఖ్యమంత్రి పది కాలాలపాటు ఉండే విధంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. రాబోయే రోజులలో పేదరికం లేని సమాజం నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.

### ప్రేమ, కరుణ, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్

ప్రేమ, కరుణ, శాంతికి ప్రతిరూపం క్రిస్మస్ అని ప్రతి ఒక్కరు క్రీస్తు సూక్తిని పాటించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్ మస్ అని దైవ కుమారుడి త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని లోక రక్షకుడైన ఏసు ప్రభువు రాష్ట్ర ప్రజలందరి పైన తమ చల్లని దీవెనలు అందించాలని కోరుకుంటున్నానన్నారు. సోదరులకు ..క్రిస్మస్.. పండుగ శుభాకాంక్షలు తెలిపారు.






## ప్రతి కార్యకర్త కాలరు ఎగుర వేసేలా పాలన చేశాం

**కష్టాలు వచ్చినప్పుడు వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదు... మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బాబు... అధికారం వున్నా, లేకున్నా నిత్యం ప్రజల కోసమే పోరాటం**



**పులివెందుల, డిసెంబర్ 24, ప్రభాతవార్త :**

కష్టాలు వచ్చినప్పుడు వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని, కష్టాలు అనేవి శాశ్వతం కాదని మనమందరం కలిసికట్టుగా పని చేయాలని, మోసపూరిత హామీలతో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాడని మనం అబద్ధాలు ఆడలేకే ప్రతిపక్షంలో ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా మొదటి రోజు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి ఇడుపులపాయకు చేరుకుని వైయస్సార్ ఘాట్ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులు అర్పించిన అనంతరంఅభిమానులకు అభివాదం చేస్తూ అనంతరం ఇడుపులపాయ ఎస్టేట్లోని చర్చి నందు జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. అనంతరం కడప ముఖ్య నేతలు, కార్పొరేటర్ల తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అలవి కానీ హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పులివెందుల పర్యటనలో అన్నారు. కష్టాలు అనేవి శాశ్వతం కావు, కష్టాలు వచ్చినప్పుడు వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని మనమందరం కలిసికట్టుగా పని చేయాలి అని దేశ చరిత్ర లోనే ఏ ఒక్కరూ చేయని మంచి పనులు చేశామని , కేవలం అపద్ధాలు చెప్పలేకపోవడంతోనే ప్రతిపక్షంలో ఉన్నామన్నారు. మోసపూరిత హామీలతో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారన్నారు. కానీ,మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసే సంప్రదాయాన్ని మనం మార్చామని కోవిడ్ సమయంలో కూడా సంక్షేమాన్ని ఆపలేదన్నారు. కార్యకర్తలు కాలరు ఎగరేసుకునేలా పాలన చేశామని అధైర్య పడవద్దు అన్నారు. 2027 చివరిలో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అని మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే అన్నారు. ప్రతికార్యకర్తకు అండగా ఉంటాం అని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలతో పాటు ఇటీవల కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను కడప నాయకులు వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్పొరేషన్లలో బలం లేకపోయినా టీడీపీ నేతలు పెత్తనం కోసం ఎలా పాకులాడుతున్నారో తమ అధినేతకు వివరించగా అందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందిస్తూ మాట మీద నిలబడితే ప్రజలు వాస్తవాలను తెలుసుకుని ఆదరిస్తారని అధికారంలో ఉన్నా లేకపోయినా నిత్యం మనం ప్రజల కోసమే పోరాడాలి అని ఆయన నేతలకు సూచించారు. కూటమి ప్రభుత్వం వాళ్ళు ప్రజల దగ్గరకు వెళ్ళాలంటే భయపడే పరిస్థితి నెలకొంది అన్నారు. ఏ ఇంటికి వెళ్లినా చిన్నపిల్లలతో సహా నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అని వారి తల్లులైతే నీకు రూ.18 వేలు, ఆ అమ్మలకు తల్లులు, అత్తలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, 20 ఏళ్ల దాటిన పిల్లవాడు ఇంట్లో కనిపిస్తే రూ.36 వేలు అని, కండువా వేసుకుని ఇంట్లోంచి రైతు బయటకు వస్తే నీకు రూ.20 వేలు అని ఇంట్లో ఎవరినీ వదిలిపెట్టకుండా ఆశపెట్టారని చెప్పారు. వారంతా మా డబ్బులు ఏమయ్యాయని నిలదీస్తారని ఏ టీడీపీ కార్యకర్త ఎవరి ఇంటికి వెళ్ళే పరిస్థితి లేదన్నారు. 2027 చివరిలో జమిలి ఎన్నికలు అంటున్నారు అని దీనితో చంద్ర బాబు లో వణుకు మొదలు అయిందని కానీ మనలో రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళుతున్నామన్నారు. మీకు నా తమ్ముడు అవినాష్ అందుబాటులో ఉంటాడని మీకు ఏ అవసరం వచ్చినా తనను కలవండని చెప్పారు. తప్పకుండా సాయం చేస్తారన్నారు. మీరందరి ప్రేమ ఎప్పటికీ మరిచిపోను అన్నారు. చంద్రబాబు బాదుడే బాదుడులాగా పాలన సాగిస్తున్నారని, సూపర్ సిక్స్ లేదు సూపర్ సెవెన్ లేదు, అందుకే మనం పోరుబాట పట్టాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికే రైతు ధర్నా చేశామని ఈ నెల 27న కరెంట్ బిల్లులపై మరో నిరసన కార్యక్రమం, జనవరి 3న విద్యార్థుల ఫీజురీఇంబర్స్‌మెంట్‌పై వారి తరుపున మరో కార్యక్రమం చేయాల్సి వస్తుందని చెప్పారు. మీ అందరి సహాయ సహకారాలు కావాలన్నారు. అంతకు మునుపు జగన్ మోహన్ రెడ్డి ని కీలక నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇడుపులపాయ లోని జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో జగన్మోహన్ రెడ్డి తల్లి మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, సుధీకర్ రెడ్డి, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, సతీష్ రెడ్డితో పాటు వైఎస్ఆర్ బంధువులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.







## చౌక దుకాణ డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : డిసెంబర్ 24, ప్రభాతవార్త

మండలంలోని ఎనిమిది చౌకదుకానపు డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం తాసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బిఎర్రగుడి పంచాయతీలోని కాలాడివాళ్లపల్లి (ఎస్సీ), పాలెం గొల్లపల్లి (ఓసి) అనంతపురం ఈడిగపల్లె (ఓసి మహిళ) ఉత్తరమేటి హరిజనవాడ (ఎస్సీ), ధప్పేపల్లి గ్రామం వల్లూరువాండ్లపల్లె (ఓసి),, కస్తూరి రాజు గారి పల్లె గ్రామం చాగలగుట్టపల్లి (ఎస్సీ),, కస్తూరిరాజుగారి పల్లి (ఓసి మహిళ), లక్కిరెడ్డిపల్లి కొత్తకొట్టా లు (ఎస్సీ), షాపులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ నెల 23 తేదీ నుంచి డిసెంబర్ 30 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.జనవరి 7 ..2025 న రాత పరీక్షలు ఉంటాయని పరీక్షల్లో ఎంపికైన వారికి వ్యక్తిగతంగా తెలియజేస్తారని ఆయన తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను తాసిల్దార్ కార్యాలయంలో అప్పజెప్పాలన్నారు. దరఖాస్తు చేసుకోదలుచుకున్నవారు ఆయా గ్రామ స్థానికులై ఉండవలెనని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై అయి ఉండవలెను ఆయన తెలియజేశారు.

## అంగన్వాడి కార్యకర్త,ఆయా పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

లక్కిరెడ్డిపల్ల : డిసెంబర్ 24 ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోనీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ పద్మావతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలంలోని అనంతపురం ఈడిగపల్లి అంగన్వాడి సహాయకురాలు (ఓసి), రామాపురం మండలంలోని బాలి రెడ్డిగారిపల్లి అంగన్వాడి కార్యకర్త (ఓసి) , ఏకిలపల్లి అంగన్వాడి సహాయకురాలు (బిసి), గాలివీడు మండలం కరీంరెడ్డిగారిపల్లె అంగనవాడి కార్యకర్త (ఓసి), పెద బల్లి మినీ అంగన్వాడి కార్యకర్త (ఓసి), పక్కిరరెడ్డిగారి పల్లి సహాయకురాలు (ఓసి),ఆరివీడు గాండ్లపల్లి సహాయకుల (ఓసి) ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 24 తేదీ నుండి జనవరి 2 తేదీ లోపు తమ కార్యాల యానికి దరఖాస్తులు అందజేయాలని ఆమె తెలిపారు.

## సర్వేలను పూర్తి చేయండి



దువ్వూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి వివిధ రకాల సర్వేలను అప్పజెప్పిందని వాటిని పూర్తి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం దువ్వూరు గ్రామ సచివాలయం-2లో ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలపై సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ సర్వేలలో మండల కేంద్రమైన దువ్వూరు చాలా వెకనబడి ఉందని దీంతో జిల్లా అధికారుల నుండి ఒత్తిడి ఎక్కువైందని అందుకోసం కుటుంబ సర్వే, దుకాణాల సర్వే, అలాగే స్మార్ట్ మీటర్ తదితర వాటిని గురించి పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షలో దువ్వూరులోని రెండు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి, డిసెంబర్ 24, ప్రభాత వార్త:

మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ శ్రావణి తెలిపారు. మండలంలోని మట్లీ పంచాయతీలో మంగళవారం రెవిన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు ఏమైనా సమస్యలు ఉంటే ఈ రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు చేయాలని తెలిపారు. తమ భూములకు సంబంధించిన రికార్డులను జిరాక్స్ జత కలిపి తమ సమస్యను ఫిర్యాదు రూపంలో తమకు అందజేయాలన్నారు. రైతులు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన తర్వాతనే వారి వారి సమస్యలను పరిష్కరించడం సాధ్యమవుతుందని తద్వారా వారి సమస్యలకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్లీ సర్పంచ్ సోమరప్ప. నాగార్జునాచారి, మాజీ ఎంపీపీ నాగభూషణం, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణతో మంచి దిగుబడి



పులివెందుల, డిసెంబరు 24, ప్రభాతవార్త :

వేరుశనగకు తెగులు నివారణ చేయడం వల్ల మంచి దిగుబడి పొందవచ్చునని వ్యవసాయ అధికారి నాగలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని చిన్న రంగాపురం గ్రామంలో ఆహారం మరియు పోషకాల భద్రత మరియు పంట నూనెలు నూనె గింజలు జాతీయ యంత్రం 2024 25 భాగంగా రైతు పేరు సాంబశివారెడ్డి వేరుశనగ పొలము రెండు ఎకరాల్లో నిర్వహించడం జరిగినది. ఈ సందర్బంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వేరుశనగ పంట లో చీడపీడలు గమనించామని తెలిపారు. రసం పీల్చే పురుగులు నివారణకు పసుపుపచ్చ పల్లాలు ఎకరానికి 25 చొప్పున పెట్టుకోవాలని దీని వలన రసం పీల్చేపురుగుల ఉధృతుని తగ్గించుకోవచ్చని తెలిపారు. వేరు కుళ్ళు నివారణకు విత్తనం నాటుకుంటున్నప్పుడే విత్తన శుద్ధి మూడు గ్రాములు లీటర్ నీటి లో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలియజేశారు. అలాగే పొగాకు లద్దె పురుగు నివారణకు 80 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేసుకోవడం వలన పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా పంచాయతీ శాఖ అధికారి

వీరబల్లి, డిసెంబర్ 24, ప్రభాత వార్త:

మండలంలో మట్లీ పంచాయతీ లోనీ ఎల్లంపల్లి దగ్గర ఏర్పాటుచేసిన చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ శాఖ అధికారి బాలకృష్ణారెడ్డి పరిశీలించడం జరిగింది. అక్కడ పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండడంతో అవి వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రునికి ఆదేశించారు. ఇక్కడ శుభ్రంగా ఉంచాలని లేదంటే కఠినమైన చర్యలు తప్పవని కార్యదర్శిని హెచ్చరించారు. అదేవిధంగా వీరబల్లి పంచాయతీలో బాలసాని వండ్లపల్లె హరిజనవాడకు మంచినీటి సౌకర్యం కల్పించాలని గతంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మండల అధికారులు ఆదేశించడం జరిగింది. అక్కడ వాళ్లకు ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యాన్ని ఆయన పరిశీలించడం జరిగింది. తమ గ్రామాలలో పారిశుధ్యం పై శ్రద్ధ వహించి ప్రజలకు అసౌకర్యంగా లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన ఆదేశించడం జరిగింది. ప్రస్తుతం వర్షాలు రావడంతో గ్రామాలలో మురికినీరు నిలవకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రామచంద్రారెడ్డి పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ త్రోబాల్ టోర్నీ రెఫరీగా బుక్కే బాలాజి

కురబలకోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



అంతర్జాతీయ త్రోబాల్ టోర్నీ రెఫరీగా కురబలకోట జడ్పిహైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బుక్కే బాలాజి ఎంపికయ్యారు. ఈ మేరకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు త్రివేణి ఓ ప్రకటనలో తెలిపారు. ఇండో శ్రీలంక ఇంటర్‌నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో మ్యాచ్‌లను నిర్వహించేందుకు ఈ రెఫరీగా బాలాజీని నియమించడం జరిగిందన్నారు. డిసెంబర్ 28వ తేది వరకు తమిళనాడులోని పోసూర్‌లోని ఆదియామాన్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో జరగబోయే ఇంటర్‌నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ నిర్వహణకుగానూ రెఫరీగా నియమించారని ఆమె తెలిపారు.

## మిట్స్ ప్రొపెసర్‌కు పిహెచ్‌డి ప్రధానం

కురబలకోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



మిట్స్ కళాశాలలో మాస్టర్‌ఆఫ్ కంప్యూటర్స్ అప్లికేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొపెసర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ షకీబ్‌కు పిహెచ్‌డి ప్రధానం చేశారు. యూపిలోనే ఆలీఘర్‌లోని ముస్లిం యూనివర్సిటి నుంచి ఆయనకు పిహెచ్‌డి పట్టా ప్రధానం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి, యువరాజ్ తెలిపారు. యాన్‌ఎఫిషియంట్ ఎంసింబ్లిడీప్ లెర్నింగ్ మోడల్ ఫర్ ఎస్టిమేషన్ అండ్ ఫోరెకెసింబ్ ఆఫ్ టైమ్ సీరిస్ డేటా అనే అంశంపై పరిశోదన చేసినందుకు గానూ డాక్టరేట్‌ను ఆ యూనివర్శిటి ప్రధానం చేసినట్లు తెలిపారు. ఆయనను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళ, ప్రిన్సిపాల్,సహచర అధ్యాపకులు అభినందించారు.

## ఎర్రబల్లి పంచాయితీలో అభివృద్ధి పనులు : సర్పంచ్

కురబలకోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



కురబలకోట మండలం ఎర్రబల్లి గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని ఆ గ్రామ సర్పంచ్ ఈశ్వర్‌నాగరత్న తెలిపారు. వివిధ నిధులు కింద పలు అభివృద్ధి పనులు పల్లెల్లో చేపట్టామని ఆమె తెలిపారు. ఎగువ చెన్నామర్రిలో తాగునీటిసమస్య పరిష్కారంకు కొత్తబోరు ఏర్పాటు చేశామన్నారు. రూ.4లక్షల వ్యయంతో సింగన్నగారిపల్లెలో సిసిరోడ్లు వేయించామన్నారు. బాపనపల్లెలో రూ.3లక్షల వ్యయంతో సిసిరోడ్డు వేశామన్నారు. పల్లెల్లో డిజిటల్ లైట్లను 30 ఏర్పాటు చేశామన్నారు. అందరి సహకారంతో మరింత గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## అభివృద్ధి పథంలో కురబలకోట గ్రామం : సర్పంచ్

కురబలకోట, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



కురబలకోట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఆ గ్రామ సర్పంచ్ సుక్కా మనోహర్ సుజాత తెలిపారు. గ్రామ పంచాయితీ పరిధిలో వివిధ గ్రాంట్లు కింద పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఆమె తెలిపారు. కురబలకోట కస్పాలో రూ.30 లక్షల వ్యయంతో వీధుల్లో సిసిరోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కొత్తపల్లెలో రూ.10లక్షలు, అరవిందనగర్‌లో రూ.3లక్షలతో సిసిరోడ్లు వేశామన్నారు. కురబలకోట ఎస్‌సి కాలనీలో, బిసి కాలనీలోరూ.15లక్షల వ్యయంతో మురుగునీటి కాలువలు నిర్మించామన్నారు. కురబలకోటలో రూ.30 లక్షలతో మురుగుకాలువలు చేపట్టామన్నారు. కొత్తపల్లె, పగడాలవారిపల్లెలో కొత్తబోర్లు డ్రిల్ చేశామన్నారు. ఎమ్మెల్యే గ్రాంటు కింద 30విద్యుత్ స్థంబాలను నాటి కొత్తగా వీధి దీపాలను ఏర్పాటు చేశామన్నారు. డంపింగ్‌యార్డు అభివృద్ధికి రూ.10లక్షలు వెచ్చించామన్నారు. అందరి సహాయ సహకారాలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు దశల వారీగా చేస్తున్నామని తెలిపారు.

## మూగవాడి పంచాయితీలో రెవెన్యూ సదస్సు



రామసముద్రం, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

మండలంలోని మూగవాడి గ్రామ పంచాయితీలో టిడిపి నాయకుడు గుండ్లపల్లె శివారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు తహశీల్దార్ నిర్మలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూసదస్సులకు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూగవాడి గ్రామంలో నిర్వహించిన సదస్సులో వివిధ సమస్యపై 11 అర్జీలు విన్నవించుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ వషీం అక్రం, విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అనుభవంలో ఉన్న స్థలాలకు పట్టాలివ్వాలి

జిల్లా అధ్యక్షులు హరికుమార్



ములకలచెరువు, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

దళితుల అనుభవంలో ఉన్న స్థలాలకు ఇంటిపట్టాలివ్వాలి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు హరికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ములకలచెరువు తహశీల్దార్ కార్యాలయంలో బాస్, సిపిఐ నాయకులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బురకాయలకోట గ్రామం పెద్దమొరవపల్లెలో దళితుల ఆధీనంలో ఉన్న భూమిని ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ డిటికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజనప్ప, మంత్రాల రమణ, నారాయణ, భాస్కర్, బండి చిన్నపాప, బాలు, రెడ్డప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలో ఖాళీల భర్తీకి ధరఖాస్తులు

రామసముద్రం, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ సుజాత తెలిపారు. ఆర్ కమతంపల్లి, కొండూరు ఎస్‌సి, ఎర్ర బోయనపల్లె బిసిఎ, జంగాలపల్లి మిని హెల్పర్ బిసిఎ, ఊలపాడు కార్యకర్త ఎస్‌సి ఫోస్టులను కేటాయించినట్లు సుజాత తెలిపారు. 21నుంచి 35ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులు అన్నారు. జనవరి 2లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## రెవెన్యూ సదస్సు విజయవంతం

కలికిరి, డిసెంబరు 24, ప్రభాతవార్త:

మండంలోని పల్లఓలు పంచాయతీలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సు విజయవంతమైంది. ఈ రెవెన్యూ సదస్సు తహసీల్దార్ మహేశ్వరీ భాయ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేశ్వరీభాయ్ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం అధికారులు గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకొని వాటిని అక్కడికక్కడే పరిష్కరించాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో పలుసమస్యలు తహసీల్దార్ పరిష్కరించారు. ఈ రెవెన్యూ సదస్సులో 16 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆ సమస్యలను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండలం నోడల్ ఆఫీసర్ జయప్రకాష్, వీఆర్వోలు సుల్తాన్, ప్రసాద్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, ఏఎస్సై మధుసూదనాచారి, దేవాదాయ శాఖ ఈవో మంజుల, ఫారెస్టు అధికారులు, మాజీ సర్పంచ్ షాబుద్దీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే చొరవతో ఘుడీ ప్రజలకు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు



కలికిరి, డిసెంబరు 24, ప్రభాతవార్త:

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో పల్లఓలు పంచాయతీ మాజీ సర్పంచ్ షాబుద్దీన్ చొరవతో గత 40 సంవత్సరాలుగా తీరని రోడ్డు సమస్య పరిష్కారం అయ్యింది. ఘుడీ గ్రామం నుంచి స్మశానానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. గతంలో ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మాజీసర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. స్పందించిన ఎమ్మెల్యే పల్లె పండగ కార్యక్రమంలో రూ.5లక్షలు నిధులు మంజూరు చేసి సిమెంటు రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామం నుంచి స్మశాన వాటిక వరకు సిమెంటు రోడ్డు పనులు చేపట్టి పూర్తిచేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## మర్రికుంటపల్లెలో సామిత్వ సర్వే



కలికిరి, డిసెంబరు 24, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో ఎంపీడీవో భానుమూర్తిరావు, ఈవోపీఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి గిరి స్వామిత్వ సర్వే ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొలతలను జీపీఎస్‌లో అటాచ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జనీఫారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలలీ ఉల్లి విత్తనాలతో రైతులు బుగ్గిపాలు..

- నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలి



పెండ్లిమర్రి, డిసెంబరు 24, ప్రభాతవార్త:

నకిలీ ఉల్లి విత్తనాలతో రైతులు బుగ్గిపాలయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మైదుకూరు మండలంలోని పర్టిలైజర్ నుంచి విత్తనాలు ఉల్లి విత్తనాలు తెచ్చుకున్నామన్నారు. ఆ ఉల్లి విత్తనాలు నాటి ఉల్లి పంట చేతికి రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని ఉల్లిపంట పండడం లేదని ఆ నకిలీ విత్తనాల వల్లనే పంట నాశనం అయ్యిందని నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 11మంది రైతులు దాదాపు 25 ఎకరాలు పంట ఉల్లి పంట వేయడం జరిగిందని అందరం నష్టపోయామని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గంగిరెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శివారెడ్డి, అన్నమయ్య, ఈశ్వరయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

## పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సిద్దవటం, డిసెంబరు 24, ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రైతు భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ నరగామన రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల భూములు అన్యాక్రాంతం చేసిన వారి ఆగడాలు అరికట్టేందుకే సభలు ఏర్పాటు చేశారని మాజీ మార్కెట్ ఛైర్మన్ సయ్యద్ జవహర్ బాషా మంగళవారం సిద్దవటం గ్రామం రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన అన్నారు. గ్రామ గ్రామాన రెవెన్యూ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తతీసుకున్నారని రైతుల భూములు అన్యాక్రంతం చేస్తే సీఎం చట్టం తీసుకొని వచ్చి కఠిన శిక్ష పడే విధంగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. మండల ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత మాట్లాడుతూ గ్రామ సభలో భూ సమస్యలపై రైతులు 26 అర్జీలు లిఖిత పూర్వకంగా అందించారని సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, వీఆర్వో కేశవులు,రజిని, జూనియర్ అసిస్టెంట్ పసుపులేటి శ్రీనివాసులు, సచివాలయ సర్వేయర్‌పురుషోత్తం, రైతులు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనలంద పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

సిద్దవటం, డిసెంబరు 24, ప్రభాతవార్త:

సిద్దవటం శ్రీనలంద పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ బాలు గారి వెంకట సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాస్టర్ డేవిడ్ విజయానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీరు మాట్లాడుతూ జీసస్ యొక్క జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం డిసెంబరు 25వ తేదీన దేశవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, బాబు, వైశాలి తదితర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంచాయితీ ఆదాయాభివృద్ధికి కృషి చేయాలి

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త :

పీలేరు గ్రామపంచాయతీ ఆదాయాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వార్డు సభ్యులతో కలిసి పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కుంటు పడకుండా, సిబ్బందికి వేతనాలు సకాలంలో అందాల అన్న పంచాయితీ ఆదాయాన్ని మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం బిల్లుల వసూలులోను శ్రద్ధ చూపాలని కోరారు.

## ఒంటిమిట్ట సీఐను సత్కరించిన తెదేపా నాయకులు

సిద్దవటం, డిసెంబరు 24, ప్రభాతవార్త:



సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ ఛైర్మన్ సంజీవరెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ బాలిరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.బాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతత వాతావరణం ఉండేలా సహకరించాలని సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు పల్లె ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఉచితంగా గృహ నిర్మాణాలు మాత్రమే రవాణా చేసుకోవాలని ఆయన సూచించారు.

## కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

సిద్దవటం, డిసెంబరు 24, ప్రభాతవార్త:



ఆదివారం కడప నగరంలోని మేడా కల్యాణ మండపంలో జరిగిన బలిజ, కాపు ఆతత్మీయ సమ్మేళనంలో పోరుమామిళ్లకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త రాళ్లపల్లి ప్రసాద్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ కార్యకర్త జనసైనికుడు ప్రసాద్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఆయన అనుచరులను పోరుమామిళ్లకు పంపించి ప్రసాద్ మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి మంగళవారం ఆయన అనుచరులతో గజమాల వేసి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు అవ్వారు రవిశంకర్, దేరంగుల శ్రీకాంత్, చలపాటి చంద్ర, బోరెడ్డి గంగిరెడ్డి రాయల్, పేరూరి కొండయ్య, నూకల రమేష్, బద్వేలు, పోరుమామిళ్ల జనసేన నాయకులు చెన్నంశెట్టి సుబ్బరాయుడు,కొంకుల రమేష్ దద్దం వెంకటేశ్వర్లు, శ్రీ రాయలసేవా సమితి సభ్యులు బద్వేలు బలిజ సంఘం సభ్యులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచండి



తంబళ్లపల్లె, డిసెంబరు 24, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో జరిగే ఉపాధి హామీ కరవు పనులలో కూలీల సంఖ్య పెంచాలని క్షేత్ర సహాయకులను ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమీక్షలో పంచాయతీల వారీగా చేసిన పనుల వివరాలు చేయాల్సిన పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఉపాధి హామీలో చేపట్టే పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలని దీంతో పాటు మొక్కల పెంపకం, సంరక్షణపై చొరవ చూపాలన్నారు. ఈ సమీక్షలో ఏపీవో అంజనప్ప, ఈసీ రామన్న, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, శేఖరమ్మ, వెంకటరమణ, నాగార్జున, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## బాలుడిని కాపాడిన మెడికల్ ఆఫీసర్

తంబళ్లపల్లె, డిసెంబరు 24, ప్రభాతవార్త:



ప్రాంతం ఏదైనా ప్రమాదం జరిగిన చోటే వైద్య సేవలను ఓ విద్యార్థిని ప్రాణాపాయం నుంచి కాపాడిన వెంకట రామయ్యకు ప్రశంసలందుకున్న సంఘటన జిల్లా సరిహద్దులో వెలుగు చూసింది. తంబళ్లపల్లె సీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ కొందరి స్వార్థ ఫిర్యాదుతో బి.కొత్తకోటకు డిప్యూటేషన్‌పై వెళ్లిన డా.వెంకటరామయ్య మంగళవారం తన సొంత పనులపై కదిరి వెళ్లి తిరిగి వస్తుండగా జిల్లా సరిహద్దు ఈదుల వంక పేపర్ ఫ్యాక్టరీ సమీపంలో హైవే రోడ్డులో కోనేటివారిపల్లెకు చెందిన చిన్నా(16) తన గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో హైవే రోడ్డుపైకి రాగా అదే సమయంలో మదనపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న ఓ లారీ చిన్నాను తప్పించబోయి రోడ్డు సైడు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్న తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆ సమయంలో స్థానికంగా గల ప్రజలుఉ చేసేది లేక దిక్కులు చూస్తూ ఉండిపోయారు. అదే సమయంలో డా.వెంకటరామయ్య విషయం తెలుసుకొని తన వాహనం నుంచి దిగి వెంటనే ఆ బాలునికి సీపీఆర్ చేయడంతో పాటు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయమని పురమాయించి బాలుల్ని ఆసుపత్రికి తరలించడానికి సహకరించాడు. బాలుడికి ప్రాణాపాయం తప్పడంతో డాక్టర్‌కు ప్రశంసల జల్లులు కురిపించారు.

## పవిత్ర ధనుర్మాసంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పెండ్లిమర్రి, డిసెంబరు 24, ప్రభాతవార్త:

మార్గశిర మాసం (ధనుర్మాసం)ను పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను మంగళవారం కొత్తూరు, నంది మడలం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

## బీసీల సాధికారిత గురించి ఆలోచించిన పార్టీ కాంగ్రెస్

వేంపల్లి, డిసెంబరు 24, ప్రభాతవార్త :

టిడిపి, వైకాపా, బిజెపి, జన సేన పార్టీలు పుట్టక ముందే బీసీల అభ్యున్నతి, సాధికారిత గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచించిందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. వేంపల్లి లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీసీ లకు విద్యా,ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 2371973 న జీవో 1793 జారీ చేసిందని, అప్పటికి టిడిపి,బిజెపి, వైకాపా, జన సేన పార్టీలు పుట్టనే లేదన్నారు. చంద్ర బాబు రాజకీయాలలోకి రాలేదని,.జగన్ ఈ భూమి మీదికే రాలేదన్నారు..ఈ రిజర్వేషన్ల వలన లక్షలాది మంది బీసీలు ఉన్నత చదువులు చదివి,ఉన్నత ఉద్యోగాలు పొంది, ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వేంపల్లి, డిసెంబరు 24, ప్రభాతవార్త :

వేంపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేంపల్లి మండల తెదేపా పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ రెడ్డి మాట్లాడుతూ సర్వమత సారం మానవత్వమేనని తెలిపారు.

**WANTED**

1 No Highly Skilled, oc Qualification: DEEE / B.Tech Contact no: 9490183662.

## లెప్రసి రోగులకు చెప్పుల పంపిణి



సుండుపల్లి డిసెంబర్ 24, ప్రభాతవార్త:
మండలంలోని రాయవరం పీహెచ్ పరిధిలోని రాయవరం, పించ చేరుకు వాండ్లపల్లి గ్రామాల్లో ఉన్న పాత లెప్రసి రోగులైన హనుమంతు, నాగిరెడ్డి మ రియు నారాయణమ్మ మంగళవారం ఉచితంగా డాక్టర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యం లో చెప్పులు పంపిణి చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ లెప్రసీ రోగులను త్వరిత గతిన గుర్తించి వైద్యము తీసుకున్నట్టు అయితే అంగవ్యకల్యం రాదన్నారు. ఎవరికైనా తమ ఒంటిమీద ప్రతి స్పర్శ, జ్ఞానం లేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రా నికి వెళ్లి పరీక్ష చేయించుకుని ఉచితంగా మందులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిహెచ్ఇ ఒ వీరనారాయణ, సూపర్ వైజర్ ఎల్లమ్మ, ఎఎన్ఎమ్ నాగభూషణమ్మ, సుభాషిణి, సౌజన్య పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరానికే రెవిన్యూ సదస్సులు

సుండుపల్లి, డిసెంబర్24,ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని సుం దుపల్లి గ్రామ సచివాలయం రెడ్డివారిపల్లి నందు స్పెషల్ ఆ ఫీసర్ జయరాముడు అధ్యక్షత న రెవిన్యూ సదస్సు ప్రారం భించడం జరిగింది. ఈ సంద ర్భంగా రైతులకు ఉన్నటువం టి సమస్యలు గురించి తెలు సుకొని అర్జీలు మూలకంగా తెలియచేయండి అని చెప్పడం జరిగింది. అనంత రం తహసీల్దార్ దైవాదీనం మాట్లాడుతూ సదస్సులో వచ్చిన 84 అర్జీలను వి చారించి పరిష్కరిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి, మండల సర్వే యర్ వెంకటసుబ్బయ్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, వీఆర్వో వెంకరమణ, సంతోష్ నాయక్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి హెల్పర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దమండెం డిసెంబర్ 24 ప్రభాత వార్త
అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం కోరుతున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ నౌజియా బేగం తెలిపారు మండలంలోని 66 సెంటర్లలో భాగం గా గుడిసివారిపల్లెలోని అంగన్వాడీ కేంద్రంలో ఒక హెల్పర్ పోస్ట్ కు దరఖా స్తులు కోరుతున్నట్లు ఆమె తెలిపారు స్థానికురాలై పదవ తరగతి పాస్ అయి ఉండాలి అందుకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లను అందుబాటులో ఉంచుకో వాలన్నారు కేటగిరి ఓసి మహిళకు కేటాయించబడిందన్నారు దీనిని స్థానికంగా ఉంటున్న ఓసి మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు వయసు 21 సంవత్స రాల పెండ్లి ఉండాలన్నారు అలాంటివారు లేనియెడల 18 సంవత్సరాలు కలి గిన మహిళలకు కేటాయించడం జరుగుతుందన్నారు ఈ అవకాశాన్ని గుర్చి వరిపల్లె అంగన్వాడిసెంటర్ గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు

## డిజిటల్ సౌలభ్యాలను వినియోగించుకోవాలి

రాయచోటి, డిసెంబర్ 24 ప్రభాతవార్త



వినియోగదారులు వర్చువల్ వి చారణలు, డిజిటల్ సౌలభ్యాలను వినియోగించుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రఘు రాం పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అన్నమయ్య జిల్లా, రా యచోటిలో జాతీయ వినియోగదా రుల దినోత్సవం 2024ను సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం మా ట్లాడుతూ వినియోగదారులకు సత్వర న్యాయాన్ని పొందడానికి వారి సమస్యల ను పరిష్కరించడానికి నిబంధనలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ వర్చువల్ విచారణ పద్ధతి వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వినియోగదారులు న్యాయస్థానాలు ఉపయోగించే వర్చువల్ పద్ధతి ద్వారా వారి సమస్యలకు పరి ష్కారం పొందగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశా ఖ అధికారి కొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలకు డా సుమనశ్రీకి ఆహ్వానం

రాజంపేట, డిసెంబర్,24, ప్రభాతవార్త.



ఈనెల 28,29. తేదీలలో విజయవాడలో జరిగే 6, వ ప్రపంచ రచయితల మహాసభలకు కడప అన్నమయ్య ఉమ్మడి జిల్లాలైన నందలూరుకు చెందిన డా.. కోడూరు సుమనశ్రీకి ఆహ్వానం అందింది. ప్రపంచ తెలుగు రచయి తల కృష్ణా జిల్లా రచయితల సంఘం కె. బి.ఎన్ కళాశాల సంయుక్తంగా ఈకార్యక్రమంను నిర్వహిస్తుందని ఆమె మంగళవారం ఒకప్రకట న ద్వారా తెలియ జేయడం జరిగింది.

## భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గాలివీడు, డిసెంబర్ 24(ప్రభాతవార్త):



భూసమస్యల పరిష్కా రానికే రెవెన్యూ సద స్సులని తహసీల్దార్ భాగ్య లత అన్నారు. మంగళ వారం మండలంలోని పూ లికుంట, పందికుంట గ్రా మాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూవివాదాలు, సరిహద్దు, మ్యుటే షన్, ఆక్రమణలు తదితర సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతు లు పూర్తి స్థాయి భూరికార్డులతో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పార్థసారథిరెడ్డి, నారాయణ, ఎం పీటీసీ చంద్రప్రకాష్‌రెడ్డి, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓలు భార్గవ్, జయన్న, సెక్ర టరీ వెంకటేశ్వర్లు, ఎండోమెంట్ అధికారి బలరాం, మాజీ సర్పంచ్ మహమ్మ ద్‌రఫీ, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, యువగళం సభ్యులు సాయిప్రసా ద్‌రెడ్డి, బూత్ కన్వీనర్ శివశంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు వీరాంజనేయులు, మహే శ్వరరెడ్డి, డీలర్లు టోపీవలి, రెడ్డప్పరెడ్డి, టీడీపీ నాయకులు కొండారెడ్డి, గోపా లయ్య, ఫారెస్ట్ రిజిస్ట్రేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది బేబి, సోని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## డీలర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాలివీడు, డిసెంబర్ 24(ప్రభాతవార్త):
మండలంలోని 12 చౌకదుకాణాల శాశ్వత డీలర్ల నియామకాలకు దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. వివరాలిలా ఉన్నా యి.. రెడ్డివారిపల్లె(ఈడబ్ల్యుఎస్), యూనియన్ బ్యాంకు ఎదురుగా(ఎస్టీ మహి ళ), పెద్దూరు (ఓసీ మహిళ), దానంరెడ్డిగారిపల్లె(ఎస్సీ జనరల్), గాలివీడు కస్బా(ఓసీ జనరల్), చావిడిపల్లి(ఎస్టీ), బోడసానివాండ్లపల్లె(ఓసీ), వెలిగల్లు కస్బా(ఎస్సీ), ఎర్రదొడ్డిపల్లి(బీసీ-ఏ మహిళ), సుగాలితాండా(ఎస్సీ), చావిడిపల్లి కొర్లకుంట(ఓసీ), ఆవులరెడ్డిగారిపల్లె(ఓసీ మహిళ) ఎఫ్‌పీ షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. జనవరి 7వ తేదీన రాతపరీక్షలు ఉంటాయని పరీక్షలలో ఎంపికైన వారికి వ్యక్తిగతంగా తెలియజేస్తారని తహసీల్దార్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆయా గ్రామ స్థానికులై, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండవలెనని ఆమె తెలియజేవారు.

## పేదలకో న్యాయం.. పెత్తందారులకు మరో న్యాయమా?

- ఆర్ అండ్ బీలో అక్రమ భవంతులు కనిపించడం లేదా అంటూ ఆవేదన
- పేదల రేకుల షెడ్లు తొలగించినట్లే ధనికుల నిర్మాణాలు తొలగించాలి
- న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన బాధితులు



గాలివీడు, డిసెంబర్ 24(ప్రభాతవార్త):
ఆర్ అండ్ బీ స్థలంలో నిరుపేదల నివాసాలు, రేకుల షెడ్లు తొలగించిన అధికారులకు అక్కడే ఉన్న భవంతులు కనిపించడం లేదా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూ డలిలో నివాసాలు కోల్పోయిన బాధితులు న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. గత వారం సర్వే నెంబర్ 2266 ఆర్ అండ్ బీ స్థలంలో అక్రమంగా నివాసం ఉన్నారంటూ రెవెన్యూ అధికారులు తమ నివాసాలను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేశారని, అదే జాగాలో ధనవంతుల భవంతుల జోలికి మాత్రం వెళ్లడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలకో న్యాయం పెత్_ందారులకు మరో న్యా యమా అంటూ ప్రశ్నఇస్తూ తొలగిస్తే ఆక్రమణలో ఉన్న అన్ని నిర్మాణాలు తొల గించాలని లేదంటూ దశాబ్దాలుగా నివాసముంటున్న తమ నివాసాలు తిరిగి తాము నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తు న్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ధనవంతులు ఇచ్చే మామూళ్లకు అమ్ముడుపో యి ఇలా ఏకపక్షంగా నిరుపేదల కడుపుకొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజలకు వివరించడంలో అడ్డంకులు తగదు

ప్రొద్దుటూరు డిసెంబర్ 24 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం కొ త్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొమిరెడ్డి శివచంద్రారెడ్డి అవి నీతిని ప్రజలకు వివరించే నేప థ్యంలో శాంతి భద్రతల పేరు తో అడ్డంకులు సృష్టించడం స మంజసం కాదని మాజీ ఎమ్మె ల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డిఎస్పి ని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీ పరిధిలో సుందరయ్య కాలనీ పక్కన స్మశాన స్థలంలో అవినీతి జరిగిందని ప్రజలకు వివరించేందుకు స్మశానం దగ్గర విలేకరుల సమావేశం ఏర్పాటు చేయ గా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు నోటీసులు ఇచ్చార న్నారు. అదే విషయంపై డిఎస్పి ని కలిసి ప్రజాధనం దుర్వినియోగం మరియు అవినీతి జరిగిందని ప్రజలకు తెలిపేందుకే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశా మని అంతే తప్ప మరొకటి కాదని వివరించినట్లు తెలిపారు. ఇప్పటికే మున్సి పాలిటీలో జరిగిన అభివృద్ధి పనులలో నిధులు దుర్వినియోగం జరిగాయని వి జిలెన్స్ విచారణ చేపట్టారని అన్నారు తామేమి ఎక్కడ అవినీతికి పాల్పడలేదని అందుకే ఇంతవరకు ఏ ఒక్క అంశంపై కూడా నిరూపించలేకపోయారని అన్నా రు కానీ కొత్తపల్లి సర్పంచ్ అవినీతిపై ఎందుకు విచారణ కు ఆదేశించారో స్ప ష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్ మీదేవి నాగరాజు మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా కౌన్సిలర్లు గుర్రం లావణ్య ఎంవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవత సంస్థకు దాత రూ.5000 విరాళం

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త ః
మదనపల్లి పట్టణం ప్రశాంత నగర్ చెందిన పీలేరు వాసి, పీలేరు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి, రిటైర్ అయిన, శ్రీమతి ఎద్దుల రాజకుమారి తన భర్త కీర్తిశేషులు రాయ వెంకటరమణ సబ్ ఇన్స్పెక్టర్ 33వ వర్ధంతి (జ్ఞాప కార్థం) సందర్భంగా మంగళవారం పీలేరు మానవత సంస్థకు రూ.5000 / విరాళం అందజేశారు. విరాళం దాత్ర.రాజకుమారి మాట్లాడుతూ పీలేరు కి చెం దిన మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయాన్ని ఇస్తున్నట్లు ఆమె చెప్పారు .తమ విరాళాన్ని ఫోన్ పే రూపంలో మానవత సంస్థ నిర్వాహకులకు పంపించినట్లు ఆమెతెలిపారు.సంస్థ నిర్వాహకులు వంగి మళ్ల రామచంద్ర, శెట్టి సుబ్రమణ్యం, వైవి రమణ, కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేష్, రహత్ భాష, అక్రమ్ భాష, సుధాకర్‌బాబులు విరాళదాతకు కృతజ్ఞ తలు తెలిపారు.

## పరిష్కారం కోసమే రెవిన్యూ సదస్సులు

రాజంపేట, డిసెంబర్ 24,ప్రభాత వార్త.
పల్లెల్లో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం రెవి న్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ్ శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద లూరు మండలంలోని టంగుటూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు కు ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ అధికారులు గ్రామా లకి వచ్చి పరిష్కరించడం జరుగుతుందన్నారు.గత ప్రభుత్వంలో భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం పేరుతో అనేక అవకతవకలు, తప్పులు జరిగాయి అన్నా రు. ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి అత్యధికంగా భూ సమస్యలు వచ్చాయన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు అమాయక రైతుల భూములను ఇతరులకు ఆన్లై న్లు చేసి,రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇవి అధికంగా ఇన్చా ర్జిల్ గా వచ్చిన డీటీలు, ఎన్నికల్లో వచ్చిన అధికారులు అత్యధికంగా ఒకరి భూ ములు ఇంకొకరికి ఆన్లైన్లు చేసి, వాటికి ప్రత్యేక ధరలు కట్టి, అత్యధికంగా దో చుకుని, అమాయక పేద రైతులను అన్యాయం చేశారన్నారు.అప్పటి నాయకు లు ఈ అధికారులను అడ్డుపెట్టుకుని పేదలు అమాయకుల భూముల్ని కాకుం డా సాగునీటి చెరువులు,కుంటలను కూడా ఆన్లైన్ చేయించుకున్నారన్నారు. ఇ లాంటి తప్పులు చేసిన ఇన్చార్జిలుగా కొనసాగిన డీటీలు, అధికారులు ఎక్కడు న్నా కూటమి ప్రభుత్వం వదిలే ప్రసక్తి లేదని అన్యాయం జరిగిన పేదలందరికీ న్యాయం చేసి, ఈ అక్రమాలు చేసిన అవినీతి అధికారులపై చర్యలు తీసు కోవడం జరుగుతుందని తెలియజేశారు.ప్రతి ఒక్కరూ ఈ సదస్సులకు హాజరై వారి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి వచ్చి నఆయనకు గ్రామ ప్రజలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసిస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలోమార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యద్దల విజయసాగర్, నందులూరు మండల ఎంపీపీ నరసయ్య, టంగుటూరు సర్పంచి ఎంపీటీసీ మైనుద్దీన్ పెంచలయ్య, మదన మోహనపురం సర్పంచి యానాది, కోనాపురం ఉపసర్పంచి పుల్లయ్య, కుందా నెల్లూరు నీటి సంఘం అధ్యక్షుడు చుక్క కొండయ్యలతో పాటు మాజీ ఎంపీ టీసీలు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## దరఖాస్తులు స్వీకరణ

పెనగలూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త
మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు స్వీకరిం చ నున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారితా అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 వ తేదీ నుండి జనవరి 2వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండలానికి 6 అంగన్వాడీ హెల్పర్ పోస్టులను గెజిట్‌లో విడుదల చేసారు, అవి మండలంలోని ఇండ్లూ రు 1, ఓపెన్ కేటగిరీ, 2.బెస్తపల్లి , ఈ డబ్ల్యూ ఎస్, 3. తిరుమలరాజుపేట, బీసీబీ 4.కొత్త దామనచర్ల, ఎస్టీ, 5.పొందలూరు, ఓసీ మరియు 6.ఆర్. అప్పారాజుపేట ఎస్సీ లకి కేటాయించడం జరిగిందని కావున అర్హత గల మహిళ అభ్యర్థులు అప్లై చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## వినతులకు 45 రోజుల్లో పరిష్కారం

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి అందిన వినతులను 45 రోజుల్లోగా పరిష్కారం చూపు తామని పీలేరు తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు తెలిపారు. మంగళ వారం పీలేరు మండలం, ముదుపులవేముల గ్రామంలో ప్రజలు, రైతుల సమ స్యలపై రెవెన్యూ సదస్సు ఇంచార్జ్ పల్లవోలు హేమచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతుల నుంచి దారి, ఇంటి పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్ వంటి పలు రకాల స మస్యలపై లిఖిత పూర్వక అర్జీలను స్వీకరించారు. కోర్టు భూ వివాదాలు, భాగ పరిష్కారాలు మా పరిధిలో లేవని ఆయన తెలియజేశారు. అర్జిదారులు కా ర్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే రెవిన్యూ సదస్సుల ద్వార సమస్యలకు పరిష్కారం చూపించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిం దని అధికారులు తెలియజేశారు. డిసెంబర్ 6 నుండి జనవరి 8 వరకు ఈ రెవిన్యూ సదస్సులు మండల వ్యాప్తంగా జరుగుతాయని దీన్ని ప్రజలు, రైతు లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎ న్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా, నోడల్ అఫీసర్ పీలేరు మండల తహశీల్దార్ భీమేశ్వరరావు, రెవెన్యూ, సచివాలయ, పోలీస్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి లబ్ధి దారునికి న్యాయం జరిగేలా చేస్తాం

పులివెందుల, డిసెంబరు 24, ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన స్వా ర్థం కోసం బడుగు, బలహీన వ ర్గాలను బలి పశువులను చేశా రని, వైయస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన అంతా రివర్స్ టెండ రింగ్‌తోనే సరిపోయిందని తెదే పా పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవా రం పులివెందుల ఏడు కిలో మీటర్ల దూరంలోని జే కే రోడ్డు నందు టిడ్కో ఇళ్ళు మంజూరు చేసిన ప్రదేశం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ టిడ్కో ద్వారా ఇళ్ళ నిర్మాణ పనులు టెండర్లు పిల వగా సింప్లెక్స్, నాగార్జున కంపెనీలు ముందుకు వచ్చాయని, అయితే ప్రభు త్వం మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా 20 కంటే తక్కువైన అన్ని టిట్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పనులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీ సుకోవడంతో పులివెందులలోని టిడ్కో ఇళ్ళ నిర్మాణాల రద్దు అయ్యాయి అ న్నారు. త్వరలో మా ఇంచార్జ్ తో కలిసి పురపాలక సంఘ మంత్రిని మరియు సీఎం దృష్టికి తీసుకెళ్లి మళ్ళీ పులివెందులలోని 1848 మంది లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. ఈ ఐదు సంవత్సరాలు పూర్తయ్యేలోపు టి డ్కో ఇండ్లు పూర్తయ్యేలా చేసి లబ్ధిదారులకు అందించేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అమర్నాథ్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలపై చంద్ర బాదుడు!

వాల్మీకిపురం, డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



విద్యుత్ చార్జీలపై సీఎం చం ద్రబాబునాయుడు ఖీచంద్రఖీబా దుడును మానుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, రాష్ట్ర ఉ ర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీ మ్ డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట కార్యక్రమం పో స్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చే స్తోందని, కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని వాగ్దానం చేసిన కూటమి పెద్దలు ఇప్పటికే రెండుసార్లు ట్రూ ఆఫ్ పేరిట విద్యుత్ ఛార్జీల ను పెంచి మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అ ధ్యక్షుడు శ్రీధర్ రాయల్, సర్పంచులు మునిభాస్కర్, రాజారెడ్డి, జయచంద్ర, కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు ఆనంద్, రవి, చికెన్ మస్తాన్, సైఫుల్లా, మదన్మోహన్ రెడ్డి, శివారెడ్డి, రఘు, రాజబాబు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాబు సూరిటీ..వీర బాదుడు గ్యారెంటీ..




కడప కార్పొరేషన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:
ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రచార సభల్లో బాబు సూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అన్నారని అధికారంలోకి వచ్చాక బాబు సూరిటీ వీర బాదుడు గ్యా రెంటీ అని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్ బి. అంజాద్ భాష లు ఎద్దేవ చేశారు. పెరిగిన విద్యుత్ ధరలపై ఈనెల 27న నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం కడపలో వైసిపి కార్యాలయం వైఎస్ఆర్సిపి పోరుబాట పోస్టర్ ఆవిష్కరించా రు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూబిరాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన 6 నెలలలోనే 2 సార్లు విద్యుత్ చార్జీలు పెం చిందన్నారు. గతంలో సీఎం చంద్రబాబు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు ఈ రాష్ట్రానికి శాపంగా మారాయి. తెదేపా ప్రభుత్వం రూ.4.85 పైసలతో విండ్ పవర్ ఉండేదని.. గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వం రూ.2.49 పైసలతో కొన్నారు. 201419 మధ్య లక్ష కోట్లకు ఒప్పందాలు ఆనాటి బాబు ప్రభుత్వం చేసుకుందని గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యా నంద రెడ్డి, నాయకులు పులి సునీల్ కుమార్, దాసరి శివ, షఫీ, కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ కే.బాబు, శ్రీరంజన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## వర్షాలతో రైతులు జాగ్రత్త వహించాలి

దువ్వూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:
ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు దిగుబడులు వస్తున్నాయని అయితే ఈ సమయంలో వర్షాలు వస్తున్నందున పంటలను కాపాడుకునేం దుకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అ మర్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చింతకుంట గ్రా మంలో పొలం పొలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వర్షాల వల్ల పడిపోయిన వరిని తిరిగి కట్టలు కట్టి నిలబెట్టుకోవచ్చని దానివల్ల ధాన్యపు గింజలు దెబ్బతినకుండా ఉంటా యన్నారు. మిగతా రకాలైన శనగా, మినుము వంటి పంటలు భూమిలో అధిక తేమ శాతం ఉండటంతో తెగుళ్లు వస్తున్నాయని వాటి నివారణకు పలు సూచ నలు అందజేశారు. అలాగే రబీలో సాగు చేసిన పంటలకు పంటల బీమా గడు వును ప్రభుత్వం ఈ నెల 30వ తేది వరకు పొడిగించిందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




## సబ్‌జైళ్లు విజిట్

కడప లీగల్, డిసెంబరు 24, ప్రభాతవార్త:
ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప శ్రీదేవి వారి సూచనల మేరకు సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.బాబాఫక్రుద్దీన్ కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమ డుగు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను విజిట్ చేయడం జరిగింది. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రధాన్యత ను తెలిపారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆ రోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం సద్విని యోగం చేసుకోవాలన్నారు. వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్లను పరిశీ లించి తగు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించడం జరిగింది. ఏవైనా సమ స్యలుంటే కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మండల న్యాయ సమి తిని మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైలు సూప రింటెండెంట్లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా రవి కుమార్

వాల్మీకిపురం డిసెంబర్ 24 ప్రభాతవార్త ః
వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యాశాల నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవి కుమార్ భాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెం ట్ డాక్టర్ ఫైరోజా బేగం డి.ఎం.హెచ్.ఓ.గా పదోన్నతిపై సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జ న్ డాక్టర్ రవికుమార్ సూపరింటెండెంట్ భాధ్యతలు చేపట్టారు.

## వాల్మీకుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా

వాల్మీకిపురం డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



పీలేరు నియోజకవర్గంలో ఉన్న వాల్మీకుల సమస్యల న్నింటినీ తప్పక పరిష్కరి స్తానని ఎమ్మెల్యే నల్లారి కి షోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నా రు. మంగళవారం వాల్మీకిపు రం మండల వాల్మీకి సేవాస మితి ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు ఎమ్మెల్యే ను కలిసి వినతిపత్రం అందజేశారు. తదితర సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సమస్య నూ తప్పక పరిష్కరించడమే కాకుండా వాల్మీకుల అభివృద్ధికి తప్పక కృషి చేస్తా నని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షులు విష్ణు చైత న్య, సెక్రటరీ భరత్ కుమార్,కోశాధికారి రమేష్, కులస్తులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు ఈ.కె.వై.సి తప్పనిసరి

వాల్మీకిపురం డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ.కె.వై. సి. చేసుకోవాలని జిల్లా వ్య వసాయ శాఖ అధికారి చంద్రా నాయక్ సూచించారు. మంగళ వారం వాల్మీకిపురం మండలం లోని చింతపర్తి రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పక పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే వరి, టమోటా, మామి డి సాగు చేసిన రైతులు కూడా పంట భీమా ప్రీమియం కట్టుకోవాలని తెలియ జేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళవారం, బుధవారం నిర్వ హించడం జరుగుతోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కా ర్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి హేమలత,రైతు సేవా కేం ద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కలకడ డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



రైతుల సమస్యల పరిష్కారా నికి రెవెన్యూ సదస్సులు నిర్వ హిస్తున్నట్లు రీసర్వే డిప్యూటీ త హసిల్దార్ భార్గవి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ సచి వాలయంలో మంగళవారం తహసిల్దార్ ఫణి కుమార్ ఆదేశానుసారం జిల్లా ఆర్టి కల్చర్ అధికారి రవిచంద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. రైతులు తమకున్న సమస్యలతో వచ్చి దరఖాస్తుల రూపంలో ఫిర్యా దు చేసినట్లు తెలిపారు.రైతుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిం చేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.రైతుల తమ సమస్యల పరిష్కా రానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తెలిపారు.మండలంలో ఉ న్న భూ సమస్యలు అడంగుల సమస్యలు వంటి వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ ఎంతగానో దోహదపడతాయని రైతులకు సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వే దేవి, విఆర్ఓ అనంతరాజు, సచివాలయం సి బ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి

పీలేరు ,డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



గిరిజన సంస్క ృతి, సాంప్రదాయాలకు ఎం తో విలువలున్నాయని, వాటిని కాపాడుకోవాల్సి న బాధ్యత అందరికీ ఉందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రె డ్డి తెలిపారు. బంజార జన్ సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ ఆధ్వర్యంలో నగిరిపల్లిలో మంగళవారం 7వ వార్షిక జాతీయ స్థాయి పద్య నాటకం, సాం ఘిక నాటికలు, శాస్త్రీయ జానపద బృంద నృత్యం కార్యక్రమాల గోడ పత్రికను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ గిరిజనుల సంస్క ృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని, గిరిజనులు, బంజారాల ప్రాముఖ్యతను చాటే సాంస్కృతిక, సాంప్రదాయ కట్టు బాట్లు, ఆచారాలు, వ్యవహారాలు వ్యక్తం చేసే ఇలాంటి కార్యక్రమాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. ఈనెల 27, 28వ తేదీల్లో తిరుపతి శ్రీవేంటేశ్వ ర విశ్వవిద్యాలయంలోని, శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించనున్న సాంస్క ృతిక కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెయస్ ఉపాధ్యక్షులు వెంకటేష్ నాయక్, వినోద్ రాథోడ్, నాగేంద్ర, శ్రీనివాసుల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

లక్కిరెడ్డిపల్లె : డిసెంబర్ 24, ప్రభాతవార్త
విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించినప్పుడే అన్ని విధాల ఆరోగ్యకరంగా ఉంటారని హెల్త్ సూపర్వైజర్ మనీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గ్రహంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలి కలకు రక్త పక్షలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర్ బాలికలు పీరియడ్స్ సమయంలో జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్తగా స్నానా లు ఆచరించి హారిక సూత్రాలు పాటించాలన్నారు. మన చుట్టూ పరిసరాలను శుభ్రం చేసి, మనం కూడా శుభ్రంగా ఉండాలని ఆహారం చేసేటప్పుడు చేతులు శుభ్రం చేసుకొని ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ సావిత్రి, విద్యార్థులు, పాల్గొన్నారు.



